# ఇంటర్వ్యూ

## కె.వి.యల్. నరసింహ శాస్త్రి




ఉదయం పదిన్నరకి ఇంటర్వ్యూ మొదలయింది.

ఆ ప్రయివేట్ కాలేజీకి పార్ట్ టైమ్ ఇంగ్లీషు లెక్చరర్ కావాలిట. ఎమ్మేలో ఫస్టు లేదా సెకండ్ క్లాసు రావాలిట. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందిట. ఉద్యోగం తాత్కాలికమట.

ప్రకటనచూసి అర్హతలు ఉన్న రెండు వందల మంది అప్లయి చేశారు. ఆ కాలేజి మేనేజిమెంటు అప్లికేషన్లను పరిశీలించి పాతిక మందిని ఇంటర్వ్యూకి స్వంత ఖర్చులతో రమ్మని కబురు పంపింది. వీరిలో రాంబాబు ఉన్నాడు.

రాంబాబుకి నాలుగేళ్ళ క్రితం యూనివర్శిటీ ఎమ్మే పట్టా వచ్చింది. ఎమ్మేకి పెట్టిన పుస్తకాల్లో రాంబాబు సంపాదించుకున్న విజ్ఞానం డబ్బాయి శాతమని తేల్చింది. అంతేకాకుండా, రాంబాబుతో ఆ యేడు పరీక్ష రాసిన వాళ్ళందరి కన్నా రాంబాబుకే ఎక్కువ మార్కులు వచ్చినట్లు గుర్తించి బంగారు పతకం ఇచ్చింది.

ఇంటర్వ్యూకి రమ్మన్న పాతిక మందిలోను ఇరవై నాలుగు మంది వచ్చారు. ఉదయం పదిన్నర నుంచి ఒంటి గంట వరకు ఇరవై మందిని ఇంటర్వ్యూ చేయగలమని చెప్పారు. వీరిలో రాంబాబు కూడా ఉన్నాడు.

రాంబాబు తన దగ్గరున్న కొద్దిపాటి డబ్బుతో కాఫీ కషాయం తాగి, మళ్ళీ వచ్చి కాలేజీ ఆవరణలో ఒక చెట్టుక్రింద ఉన్న సిమెంటు బెంచీ మీద కూర్చున్నాడు.

మూడింటికి మళ్ళీ ఇంటర్వ్యూ మొదలయింది. అటెండర్ వచ్చి ఎవర్నో పిల్చాడు. అతడు సర్టిఫికెట్ల పొదని పట్టుకొని, చెమట తుడుచుకుంటూ హడావిడిగా లోపలి కెళ్ళాడు.

అంతలో అక్కడికి ఒక యువకుడు వచ్చాడు. అతని దృష్టిలో రాంబాబు పడ్డాడు.

"ఇంటర్వ్యూకి వచ్చారా?" అడిగాడు ఆ యువకుడు.

"అవును, మీరు?"

"నేనూ ఇంటర్వ్యూకే వచ్చాను" అని చిన్నగా

నవ్వసాగా డా యువకుడు.

అతనివంక అర్థం కాని వాడిలా చూశాడు రాంబాబు.

"ఈ ఇంటర్వ్యూ అంతా నాటక మండీ! మీరు ఇదివరకు వినలేదా? కాండిడేట్‌ని సెలక్టు చేసుకున్న తర్వాతే ఇంటర్వ్యూలు జరుగుతాయని?" అన్నాడు యువకుడు.

"ఏదో వింటా మనుకోండి. అయినా ఆశ ఉంటుంది కదండీ."

"అది నిజమే ననుకోండి కాని, ఈ ఇంటర్వ్యూ మీద ఆశ వదలుకోవచ్చు మీరు."

"అదేం. అంత ఖండితంగా చెబుతున్నారు. వీళ్ళు కూడా కాండిడేట్‌ని సెలక్టు చేసేసు కున్నారా?

"ఏమో లెండి. నన్నింకా ఇంటర్వ్యూ చేయలేదు. అసలు ఇంటర్వ్యూ లేమిటండీ? నేను యూనివర్శిటీ ఫస్ట్‌ని. నేను సమర్థుడనని, చదువుకుని రాసిన పరీక్షలు తేల్చాక వీళ్ళు మళ్ళా చూసే దేమిటండీ? పిల్లలకు చదువు చెప్పటం చేతకావాలి మనకు. వీళ్ళడిగే నాలుగు ప్రశ్నల్లోనూ ఈ విషయం తెలుస్తుందా?"

నవ్వి, మళ్ళీ మామూలుగా వినసాగాడా యువకుడు

"అవునండి. సంవత్సరంపాటు చదువుకున్న విజ్ఞానాన్ని మూడు గంటలు తేల్చేస్తాయట. కానీ ఆ మూడు గంటల్లోనే మనం నిరూపించుకున్న సామర్థ్యాన్ని ఈ ఇంటర్వ్యూ క్షణాలు బేరీజు వేస్తాయట. నేను ఇరవై ఇంటర్వ్యూలకు వెళ్ళాను. షేక్స్‌పియర్ ఎన్ని నాటకాలు రాశాడు? పారడైజ్ లాస్ట్ రాసిందెవరు? మన రాష్ట్రపతి ఎవరు? ఇవేనటండీ, ఎమ్మే ఇంగ్లీషు వాణ్ణి అడిగే ప్రశ్నలు? ఈ ప్రశ్నలకు కరక్టు గానే జవాబులు చెప్తేంగా, ఉద్యోగం రాదేం?"

"ఆ ఉద్యోగం వాళ్ళవాడికో, వాడు లేకపోతే ముడుపు చెల్లించిన వాడికో వెళ్ళిపోతుంది" అన్నా డా యువకుడు.

"అవునూ, ఇందాక మీరు ఈ ఉద్యోగాన్ని ఎవరికో ఇచ్చేశారని చెప్పారుగా. ఎవరో తెలుసా మీకు?" రాంబాబు అడిగాడు.

"ఎవరో అయితే నా కెలా తెలుస్తుందండీ. నాకే ఈ ఉద్యోగం ఇచ్చారు. ఈ రెండు వందల యాభై రూపాయల తాత్కాలిక ఉద్యోగాన్ని ఐదువేలుపోసి కొనుక్కున్నాను ..."

ఆ పై మాటలు రాంబాబుకి వినిపించలేదు.

మౌనంగా ఉండిపోయాడు.

ఇంటర్వ్యూ పూర్తి కాకుండానే రిగ్రెట్ కార్డు వచ్చిం దతనికి. రిగ్రెట్ కార్డు అందుకోవటం అతనికి వింతేమీ కాదుకాని, ఇది చాలా వింతయిన రిగ్రెట్ కార్డు!

ఈలోగా ఇద్దరి ఇంటర్వ్యూ పూర్తయింది. ఇక వెళ్ళవలసింది రాంబాబే.

అటెండరు బైటికి వచ్చాడు. అతని వంక చూశాడు రాంబాబు.

"అయ్యగారు కాఫీ తాగుతున్నారు. కుసేపాగండి పిలుస్తారు" అడక్కుండానే చెప్పాడు ఆటెండరు.

పావుగంట గడిచింది.

లోపలి కెళ్ళిన అటెండరు 'రాంబాబు, కె. రాంబాబు' అంటూ వచ్చాడు.

> **మనల్ని ప్రశంసించేవారికన్న మనల్ని ప్రేమించేవారే మంచి స్నేహితులు. వారే మనం చేసే మంచి పనులలో సాయం చేస్తారు.**
>
> —ఛానింగ్

రాంబాబు లేచి లోపలికి వెళ్ళాడు.

ఈ పార్ట్‌టైమ్ ఇంగ్లీషు లెక్చరర్ తాత్కాలిక ఉద్యోగాన్ని కోరుతున్న అభ్యర్థులను నలుగురు ఇంటర్వ్యూ చేస్తున్నారు. వాళ్ళలో ముగ్గురు కాలేజీ మేనేజిమెంటు సభ్యులు కాగా, వాళ్ళ చేతుల్లో తొత్తు ప్రిన్సిపాల్ నాల్గవ వాడు.

వాళ్ళు పొద్దున నుంచీ ఇంటర్వ్యూ చేసి విసిగిపోయి ఉన్నారు. ఇతను లాస్ట్ బట్ ఒన్ వాడైనా లాస్ట్ వాడని తెలుసు.

డబ్బులిచ్చి ఉద్యోగాన్ని కొనుక్కున్న వాడు ఎన్నో షరతులకి ( కాగితం మీద వేసిన జీతంలో సగం ఇస్తామని, ఎప్పుడైనా నోటీ సనేది లేకుండా తీసేస్తామని ... ఇత్యాదులు ) ఒప్పుకున్నాక ఐదింటికి వస్తే ఎప్పాయింట్‌మెంట్ ఆర్డర్ ఇస్తామని చెప్పారు.

రాంబాబు పంపిన అప్లికేషన్ ప్రిన్సిపాల్ చేతిలో ఉందిప్పుడు.

రాంబాబు నలుగురికీ విష్ చేశాడు. 'టేక్ యువర్ సీట్' అని ప్రిన్సిపాల్ అనటంతో 'థాంక్యూ సర్స్' అని కూర్చున్నాడు రాంబాబు.

"నీ పేరు?" ప్రిన్సిపాల్ అడిగాడు.

"సుబ్బారావు."

"మరి అప్లికేషన్‌లో రాంబాబని రాశావేమిటి?"

"అందులో బ్లాక్ లెటర్స్‌లో పెద్దగా ఉన్నప్పుడు పేరు ఎందు కడిగారు?"

నలుగురూ ఉలిక్కిపడ్డారు. ఒకడు మరీ ఉలిక్కిపడ్డాడు. వాడు నల్లగా ఉన్నాడు. వాడి పెదాలు నల్లగా ఉన్నాయి. పళ్ళు గారపట్టి నల్లగా ఉన్నాయి. వాడి కళ్ళలో ఎర్రజీర ఉంది.

"గట్టివాడవే, మరీ బడ్జెట్ వచ్చాక మాక్డొవెల్ విస్కీ రేటు ఎంత పెరిగిందో తెలుసునా?" అడిగాడు గారపళ్ళు.

రాంబాబు వాడి వంక మండిపోతూ చూశాడు. ఇందాక విన్న విషయమే చుట్టూ గిరగిరా తిరుగుతోంది.

"అది తెలిదేమోలే నీకు. గంగా కావేరీలను కలపటానికి ఎన్ని రోజులు పడుతుంది?" ఇంకొకడు అడిగాడు.

"పది రోజులు" చెప్పాడు రాంబాబు. అతని పెదాలు వణకుతున్నాయి. ఏదో మొండి ధైర్యం వచ్చింది.

"ఎట్టెట్టా, నువ్వు ఎమ్మేవా, ఇంజినీరువా? మా మామ కంటాట్టరు కాదు గందా" వాడే అడిగాడు.

"కంటాట్టరయితే, ఈ ఉద్యోగానికి ఎందు కొస్తాడు?" అన్నాడు నాల్గో వాడు.

రాంబాబు రక్తం సలసల కాగిపోతోంది. ఒంట్లోని రక్తమంతా కూడ బలుక్కుని మొఖం మీదకు వచ్చినట్లు మొఖం కందగడ్డలా తయారైంది. రక్తం సలసల కాగుతున్నందున శరీరమంతా చెమట ఆవిరి చుక్కలు!!

"అవునుగానీ, ఎమ్మే ఫస్టూ నూ— లాల్ బహదూర్ శాస్త్రి పూర్తి పేరేమిటి?" నాల్గో వాడే అడిగాడు.

"లాల్ బహదూర్ శాస్త్రి పూర్తి పేరా?"

"అవును, చెప్పు."

"చెప్పనా, నా బొంద ... నీ బొంద" అంటూనే లేచాడు రాంబాబు.

నలుగురికీ ఒక్కసారి వళ్ళు జలదరించింది. కళ్ళనీ, మొఖాన్నీ పదేపదే విదుల్చుకున్నాడు గారపళ్ళు. నలుగురికీ నోటే మాట రావటం లేదు.

నలుగురి వంకా రాంబాబు మార్చి మార్చి చూశాడు.

నాలుగు న్యూక్లియర్ బాంబుల్ని ప్రేల్చి నిలువునా పడేస్తున్నట్లు ఇలా అన్నాడు:

"ఇక్కడున్న మీ నలుగురిలోనూ, ప్రిన్సిపాల్ మినహా ఎవరూ ఎమ్మే చదవలేదు. నేను నాలుగేళ్ళ క్రితం ఎమ్మే యూనివర్శిటీ ఫస్ట్‌న పాసయ్యాను. మీలో ఒకడికి విస్కీ రేటు కావాలి. వీడెళ్ళి బారుల్లో కూర్చోక ఇక్క డెందుకు? మరోడికి గంగా—కావేరి నదుల్ని ఎన్ని రోజుల్లో కలప గలమో కావాలి. రోజుల్లోనే కలిపేస్తామా వాటిని? వీడు అక్కడి కెళ్ళి కాంట్రాక్టుకి దేవిళ్ళాడక ఇక్కడెందుకు? లాల్ బహదూర్ శాస్త్రి పూర్తి పేరు కావాలి కదూ నీకు. నువ్వు చెప్పరా ఏమిటో? ప్రిన్సిపాల్‌గారూ! చదువుకున్న మీరు కూడా వీళ్ళతో కలిసిపోయి నిరుద్యోగులతో ఇంటర్వ్యూ ఆటలు ఆడుకుంటున్నారా? ఏమిటి మీ కీ ఆటలో ఆనందం? ఇంటర్వ్యూలలో పట్టభద్రులు మహాభారతాన్ని అల్లసాని పెద్దన రాశాడని, ప్రధాన మంత్రి పేరడిగితే ఎవరి పేరో చెప్పాడని, తాజమహల్ హైదరాబాద్‌లో ఉందన్నారని పేపర్లలో బాక్సు కట్టివేయిస్తుంటారుగా? దమ్ముంటే మీరడిగిన ప్రశ్నల్ని, నేను చెప్పిన జవాబుల్ని వేయించండిరా ... వేయించండి. మీరు ఐదు వేలు తీసుకుని ఉద్యోగ మిచ్చేసిన వాడు బైట రెడీగా ఉన్నాడు. ఇలా నిరుద్యోగులతో ఆడుకుంటుంటే మీ ఆట కట్టే రోజు తప్పకుండా వస్తుంది. నాకు ఉద్యోగం రాకపోయినా ... ఆ రోజు మాత్రం రావాలి. మీ లాంటి వాళ్ళందరికీ గోరీలు కట్టాలి ..."

ఆ నలుగురికీ కళ్ళు బైర్లు కమ్మాయి. వాళ్ళు తేరుకుని అటెండర్ని పిలిచేలోగా ... రాంబాబు అక్కడ లేడు.

రోడ్డు మీద కొచ్చిన రాంబాబు దగ్గరికి ఒక రిక్షా వాలా ఆశగా వచ్చాడు.

"రిక్షా కావాలా బాబూ!"

ఒక క్షణం రిక్షా వాలా వంకా, రిక్షా వంకా చూశాడు రాంబాబు.

" . కావాలి."

"ఎక్కండి బాబు."

"ఎక్కటానికి కాదు ... తొక్కటానికి ..." ★